
# పరపతి



పినిశెట్టి
శ్రీనివాసరావు

**గేటు** తీసిన శబ్దం అవటంతో—

"చూడు ఎవ రొచ్చారో" అన్నాను శ్రీమతితో.

శ్రీమతి ఇంకా బయటకు వచ్చి చూడకముందే లొల్లి చేసుకుంటూ ఒక పదిమంది చిన్నా, పెద్దా వచ్చి పడ్డారు గేటు తీసుకుని లోపలికి.

'ఏవిటీ—వీళ్ళంతా ఎవర్నుం. నా తన్న టానికి గానీ రాలేదుకదా' అని ఆశ్చర్యపోతూ చూస్తున్నాను.

"ఏవిటీ ఇలా వచ్చారు? ఏంకావాలి?" అని అడిగింది అర్ధాంగి.

"అంజయ్య సా రున్నా రామ్మ! కూస్తంత టించరు మందు కావాలమ్మా. బిడ్డ నెత్తిమీద రోకలి పడిపోనాది. బొక్కడి పోనాదేమో రక్తం ఏరులా కారిపోనాది.' అన్నాడు మందిలో ఒకడు.

అంజయ్య గారంటే మా ఇంటి వోన రన్నమాట.

అంటే వాళ్ళంతా మా ఇంటి వోనరుగారికోసం వచ్చారన్నమాట. ఈ పేటలో బీదా బిక్కీలకు కడుపునొప్పి, వూష్ణము, బేదులు, చిన్న చిన్న గాయాలు మొదలగువాటికి ఉచితంగా సొంత పరిజ్ఞానంతో మందులిచ్చే డాక్టరు దేవుడన్నమాట. అంజయ్యగారు ప్రభుత్వ ఆస్పత్రి తాలూకు చిన్న ఉద్యోగి. అక్కడెలాగూ డాక్టర్లు లేనప్పుడు నర్సులే మందు లిస్తుంటారు కనక అంజయ్యగారు తనుమాత్రం అలా ఎందుకు చేయకూడదని ఆస్పత్రి నుంచి అప్పనంగా తెచ్చిన మందులతో ఇంటివద్దనే ఒక మెడికల్ స్టోరు ఏర్పాటుచేసి టానిక్కులు, విటమిన్ టాబ్లెట్‌లు సొంతానికి వాడుకొంటూ, అణా కాణి గోళీలు, టించరు వంటి వాటిని అడగవచ్చిన అలగా జనానికి ఇచ్చి 'డాక్టరుబాబు' అన్న బిరుదు సంపాదించుకొని మకుటంలేని మహారాజాలా వెలిగిపోత న్నాడు.

బయట గోల అంజయ్యగారి ఇయర్ డ్రమ్‌ను తాకి ఇదీ సంగతి అని చెప్పిందో, ఏమో...ఆయన టించర్ అయోడిన్ పెద్ద సైజు బాటిల్‌ను కుడిచేతను, కాటన్ రోల్‌ను ఎడమ చేతను ధరించినవాడై, మందహాసం చేస్తూ హుందాగా బయటికొచ్చి "ఏదీ...ఎక్కడ గాయము?" అని అడిగారు జనాన్ని.

"ఇదిగోండి, బాబూ, కాసంత బెజ్జ మడి పోనాది. లేసినేళ బాగోలేదండి, బాబు" అంటూ ఆరేళ్ళ పిల్ల తలను గాయం కన్పడేలా వంచి పట్టుకున్నాడు పిల్ల తండ్రి కాబోలు.

"ఏం పర్వాలేదు, నాయనా, ఆ దేవుని స్మరింపుము. నీ కొచ్చిన కష్టాలన్నీ మబ్బు విడినట్లు, వాటంతటవే

పారిపోతాయి'' అంటూ అభయం ఇచ్చాడు అంజయ్య డాక్టరు. "మరేం కంగారు లేదు, ఈ మందు పడితే గాయము మాడి చస్తుంది'' అంటూ సీసా మూతలోకి ఇంత టించరొంచి, అందులో దూది కొంచెం ముంచి ఆ పిల్ల నెత్తినున్న గాయంమీద అద్దాడు.

టించ రద్దగానే భగ్గున మండిం దేమో! గుంటకాస్త కెవ్వుమంది. దాంతో అక్కడున్న మిగతా గుంటలు కోరస్ పాడినట్లు ఏడుపు లంకించుకున్నారు జాయింట్‌గా.

ఇక తనపని అయిపోయినదని డాక్టరుగారు వెనుదిరిగి మందిర ప్రవేశం చేయబోతున్నంతలో—

"డాక్టరు బాబూ! వెళ్ళొస్తాం... దండాలు, బాబు. ధర్మ ప్రభువులు'' అంటూ చిన్నా పెద్దా చేతులెత్తి దండం పెడుతుంటే...

అంజయ్యగారు గర్వంగా తలూపుతూ తన మందు సామానుతో సహా లోపలకు నిష్క్రమించారు.

"ఇకపదండి'' అని వాళ్ళల్లో వాళ్ళే అనుకుంటూ ఒకరి వెనుక నొకరు గేటు తీసుకొని బయటపడ్డారు.

"గేటు దగ్గరకు వెయ్యకుండా ఎలా పొయ్యారో అలగా మూక'' అనుకుంటూ విసుగ్గా వెళ్ళి, గేటు దగ్గరకు లాగి గడియపెట్టి వచ్చింది అర్థాంగి.

అంతవరకు నవల చదువుకొంటున్న నాకు—'చ చ చ! పది నిముషాలు వేస్టయ్యాయి. అంటే ఇరవై పేజీలు వెనుకపడిపోయా నన్నమాట' అనిపించి, కాస్త చిరాకు వేసింది. అయినా వేస్టయిన టైమును కాంపెన్సేట్ చేసేయాలన్న ఆత్రతతో అక్షరాల మీదుగా కళ్ళు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లా పరుగెత్తించేస్తున్నాను.

ఆ నా స్పీడుకి సడన్ బ్రేక్ వేసినట్లు—"చూశారా ఆయన పరపతి?'' అన్నది అర్థాంగి వోరగా చూస్తూ.

చదువుతున్న పుస్తకంలోంచి తలెత్తి చూశాను అర్థాంగివైపు.

"ఏమిటన్నావ్'' అన్నాను మెల్లిగా.

"అదే ప్రక్కింటాయన. మన హౌస్ వోనర్ సంగతి...చుట్టు ప్రక్కల అందరికీ ఆయన డాక్టరు బాబూ, దేవుడూను. చేసేది చిన్న ఉద్యోగం అయితేనేం పెద్ద పేరుంది. మీరూ వెలగబెట్టున్నారు పెద్ద ఆఫీసరుద్యోగం. ఎందుకూ? కనీసం ఒక్క ప్యూనైనా రాడు ఇంటికి, ఏదైనా పని చేయించుకుందామంటే. వాళ్ళు పిలిస్తే పదిమంది వచ్చి పనిచేసి పెడ్తారు. దేనికైనా తెలివితేట లుండాల్లెండి'' అంది హేళనగా అర్థాంగి.

"అయితే ఏం చెయ్యమంటావ్ నన్ను? ఆయన హాస్పిటల్లో రోగులకివ్వాల్సిన మందులు దొంగతనంగా తెచ్చుకుని ఇంటిదగ్గర దొరతనం వెలగబెడుతున్నాడని...'' నా క్రోధం వస్తే ఆగదు. మాటలు స్పీడు, సౌండు రెండూ పెంచుకొంటాయి. వాల్యూమ్ పెరిగితే హౌస్ వోనరుకు వినపడి ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని తమాయించుకొని నోరు మూసుకున్నాను.

అయినా శ్రీమతి సాధింపు మాన లేదు.

"దొంగతనమో, దొరతనమో పరపతైతే వుందికదా! మీకు అది సంపాదించటం చేతకాదంటే ఉడుకెందుకు'' అని దీర్ఘాలు తీసింది.

"ఛా! నాకు రాదు—రాదు—రాదు. దగుల్బాజీ పనులు చేయటం నాకు చేతకాదు, నచ్చదు. అయినా వాళ్ళకంటే మందులు మాకులు ఉంటాయి—ఇంటికి తెచ్చుకోవటానికి, నల్గురికీ పంచుకోవటానికి. నా కేముంటాయ్ ఆఫీసులో'' కోపంతో వూగిపోతూ అన్నాను.

"ఆఫీసులో ఏవీ ఉండవూ... ఆలోచించండి'' అంది శ్రీమతి.

"ఏముంటాయ్! ఏముంటాయ్!'' శెట్టించుకొంటూ ఆలోచనలోపడ్డాను.

"నేను చెప్పనా! తెల్ల కాగితాలు, పెన్సిళ్ళు, పెన్నులు... ఇల్లాంటివి కొల్లలుగా ఉంటాయికదా!''

"వూ ఉంటే'' అన్నాను ఏమీ అర్థం కాక.

"ఇంకా విడమరచి చెప్పాలండీ అవి తెమ్మని! అవి అప్పుడప్పుడు ఇక్కడ పాకల్లో ఉండేవాళ్ళ పిల్లలకు పంచిపెడదాం. అలాగ కొంచెం పరపతి సంపాదించామంటే మనకూ కొంత పరపతి కలుగుతుంది. ఏమంటారు!''

సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పి పడిపోయేముందు వచ్చే జర్క్‌లా ఒళ్ళంతా వూగిపోసాగింది శ్రీమతి మాటలు చెవినిపడ్డాక.

"ఛీ నోర్ముయ్! వయసొచ్చినకొద్దీ బుద్ధి చిన్నదైపోతోందే నీకు. సిగ్గులేదూ అలా చెయ్యమని చెప్పటానికి' అంటూ ఒక్క కసురు కసిరాను.

అంతే ఆ తర్వాత కరెంటుపోయిన రేడియో సెట్‌లా సైలెంట్ అయిపోయింది అర్థాంగి వోరు.

ఇంతకీ శ్రీమతి బెంగంతా నేను ఆఫీసరు ఉద్యోగం వెలగబెడుతున్నా... చుట్టుప్రక్కల మాకు ఏమాత్రం గుర్తింపులేదని!

దానికితోడు ఇల్లుగలావిడ చదువుకోకపోయినా, వాళ్ళాయన ప్రయోజకత్వాన్ని గూర్చి చెప్పి గొప్పలు పోతుంటుందని మా ఆవిడకు ఈర్ష్య. అందుకే ఎలాగైనా షార్ట్‌కట్‌లో, రాంగ్ రూట్‌లో చుట్టుప్రక్క వాళ్ళందరి దగ్గర్నుంచి కొంచెం పరపతి సంపాదించాలని ఆకాంక్ష.

●   ●   ●

ఇది జరిగిన నెల్రోజుల కను కుంటాను. నేను ఆఫీసునుండి ఇంటికొచ్చేటప్పటికి ఇంటిముందు ఒక యాభైమందికి తక్కువకాకుండా జనం మూగి ఉండటంతో మళ్ళీ ఏదో ముంచు కొచ్చిందని, డాక్టరుగారు మందులిస్తున్నారుకాబోలని అనుకుంటూ గేటు దాటి లోపలకు అడుగుపెట్టాను.

ఆడవాళ్ళు ఒకప్రక్కగా కూర్చుని శోకాలు తీస్తున్నారు. 'ఇదేమిటి వెధవ సంతా, చిన్నదానికి, పెద్దదానికి శోకాలే' అనుకుంటూ వీధి గుమ్మం మూసి ఉండటంతో, దొడ్డి గుమ్మం వైపునుండి ఇంట్లోకి వెళ్ళాను.

నా అర్థాంగి, "పరపతి''గారి అర్థాంగి మంచంమీద ప్రక్క ప్రక్కన కూర్చుని బిక్కు బిక్కుమంటూ చూస్తున్నారు.

"ఏమిటే?'' అన్నాను అర్థంకాక.

"అన్నయ్యగారూ'' అంటూ ఆవిడ ఏడుపు మొదలుపెట్టి చేతుల్లో ముఖం దాచుకుంది, అసలు విషయం చెప్పకుండా.

'సువ్వయినా చెప్పు, ఏం జరిగిందో' అన్నట్లు చూశాను అర్థాంగి వైపు.

"మధ్యాహ్నం ఎవరో మందు కోసం వస్తే, ఆయన లేరని అంజయ్య గారి శ్రీమతే ఏవో గోళీలూ అవీ ఇచ్చిందట. అవి ఇవ్వగానే నాలుగో నెల పిల్లగాడు కళ్ళు తేలేశాడట. వాళ్ళోళ్ళంతా కోపంతో వచ్చేటప్పటికి, భయంవేసి లోపల కూర్చున్నా.'' అంది శ్రీమతి.

పరిస్థితి అర్థం చేసుకున్నాను. "సరే మీరేం ఖంగారుపడకండి. నేను ఇంజనీరు గారింటికి వెళ్ళి హాస్పిటల్‌కు ఫోనుచేసి అంజయ్యగారికి విషయం చెప్తాను. మీరుమాత్రం లోపలే ఉండి గడియపెట్టుకోండి'' అంటూ లేచాను. కాస్సేపటికి అంజయ్యగారు దిగారు. నేనూ, ఆయనా కలిసి బయటచేరిన జనానికి సర్దిచెప్పి వ్యవహారం చక్కబెట్టేటప్పటికి తల ప్రాణం తోకకు వచ్చినంత పనయ్యింది.

మరెప్పుడూ మా ఆవిడ అంజయ్యగారి పరపతి గురించి నాతో ప్రస్తావించలేదు. *


# బంపర్ ఆఫర్

## 30 రోజులు ఉచిత పరీక్ష



జెనీవా 2 బాండ్ల ఆల్‌వరల్డ్ ట్రాన్సిస్టర్ అమ్మకంపన్ను, పోస్టేజి, ప్యాకింగ్ ఇత్యాదిఖర్చులతో సహాచేర్చి కేవలం రూ. 130కే లైసెన్సు అవసరం లేదు. భారతదేశంలోని ఏ గ్రామానికైనా, లేదా పట్నానికైనా వి. పి. పి. ద్వారా పంపబడుతుంది. రెండు సంవత్సరాల హామీ నేడే మీ ఆర్డరు పంపండి.

**GENEVA ELECTRONICS (A. P)**
**136, New Layalpur, Delhi-51.**
**Phone: 212453.**